పార్కులో మోటర్లు మాయం!


నిరుపయోగంగా మారిన నీటి సంపు


నీళ్లు లేక ఎండిపోయిన మొక్కలు


నీరు లేక బాత్‌రూమ్ పరిస్థితి


పార్కులో వ్యర్థ పదార్థాలు

హెచ్‌ఏఎల్ పార్కులో ఉన్న బోరుబావుల్లో ఉండాల్సిన సబ్‌మెర్సిబుల్ మోటర్లు మాయం అయ్యాయి. దీంతో పార్కులో మొక్కలకు నీరు అందక చెట్లు ఎండిపోతున్నాయి. పార్కు ప్రాంగణం అధ్వానంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరతున్నారు. – ఓల్డ్‌బోయిన్‌పల్లి


పార్కులో మోటర్లు లేక నిరుపయోగంగా మారిన బోరు బావులు

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సరైన సమయంలో తక్షణమే స్పందించి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు రాసిన లేఖకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కమ్మ కులంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి విద్య, ఉపాధి కోసం కమ్మ కార్పొరేషన్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ సందర్భంగా కమ్మ సంఘాల సమాఖ్య తెలంగాణ గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణ ప్రసాద్, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, పాతూరి వెంకట్‌రావు, చంద్రమౌళి తదితరులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వటం మానుకో

మల్కాజిగిరి బీజేపీ అధికార ప్రతినిధి సాయినాథ్‌రెడ్డి



కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కార్యకర్తల సమావేశంలో హరీష్‌రెడ్డి రాజీనామాపై ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి బీజేపీ అధికార ప్రతినిధి పట్లోళ్ల సాయినాథ్‌రెడ్డి ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరీష్‌రెడ్డి అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. బీజేపీ పార్టీకి కాదని, హరీష్‌రెడ్డి రాజీనామా లెటర్‌ని కాంతారావు సరిగ్గా చదువుకోవాలన్నారు. హరీష్‌రెడ్డి పార్టీ మారుతున్నారని మీకు చెప్పారా? మీరే సృష్టించి స్టేట్‌మెంట్‌లు ఇవ్వటం సరికాదన్నారు. అసలు మీకు కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఒకసారి అఫీషియల్‌గా డిక్లేర్ చేసిన లెటర్ ఉంటే చూపించమన్నారు.

మీరు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీకి రాజీనామా చేశారు గుర్తుందా?

ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో జనసేకు టికెట్ ఇస్తే మీరు పార్టీకి రాజీనామా చేశారు గుర్తుందా? అంటే మీరు కూడా పార్టీ మారిన ట్లేనా? అని ప్రశ్నించారు. అసలు మీకు నైతిక విలువలు ఉన్నాయని అన్నారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఫొటో పెట్టని మీరు అసలు బీజేపీ నాయకులేనా? ఒక్క రోజు కూడా కార్యకర్తల బాగోగులు చూసుకోని మీరు, కార్యకర్తలను చీడపురుగుల్లా చూసే మీరు మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. ఈరోజు జిల్లాలో బీజేపీ పార్టీ ఇంత గొప్పగా ఉందంటే అది హరీష్‌రెడ్డి, కార్యకర్తల కష్టమేనన్నారు. ఇంకోసారి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లడాలన్నారు. హరీష్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రాట్యుటీ వచ్చేలా కృషి చేసిన రవిసింగ్‌కు కృతజ్ఞతలు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ ఇండస్ట్రియల్ ఆకృతి ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలో సంతోష్ అనే కార్మికుడు కొన్నేళ్ల నుంచి పని చేసేవాడు. అనివార్య కారణాల వల్ల కంపెనీ మూసివేశారు. సంతోష్ తనకు రావాల్సిన గ్రాట్యుటీ ఇవ్వకపోవటంతో పలుమార్లు కంపెనీ యాజమాన్యాన్ని అడిగి విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన వారి ద్వారా బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్ గురించి తెలుసుకొని తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన రవిసింగ్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి కార్మికుడికి రావల్సిన గ్రాట్యుటీ రూ.45వేలను ఇప్పించారు. కార్మికుడు మాట్లాడుతూ.. తనకు న్యాయం చేసిన రవిసింగ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, సుదర్శన్, జగన్, ప్రేమ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


కంపెనీ నుంచి కార్మికుడికి రావాల్సిన గ్రాట్యుటీని ఇప్పించిన కార్మిక నాయకుడు రవిసింగ్

'రోడ్ షో'కు తరలిన కమల దళం


బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్

మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా శుక్రవారం ప్రధాన మంత్రి మోదీ రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోకు మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ బీజేపీ కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. – మోతీనగర్


మూసాపేట నుంచి తరలి వెళ్తున్న కార్యకర్తలు

నిద్రమత్తులో డ్రైవింగ్ చాలా ప్రమాదకరం



రాయదుర్గం: నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ గురు ఎస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని (వరల్డ్ స్లీప్ డే)ను పురస్కరించుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ విభాగం, 50 మంది తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నతోద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు నిద్ర మత్తులో వాహనాలను నడపడం వల్లనే భారతదేశంలో 40 శాతం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించేందుకు డ్రైవర్లంతా నిబంధనలకు అనుగుణంగా వాహనాన్ని నడిపేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్, ఆర్టీసీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. శైలజా మూర్తి, డాక్టర్ పి శ్రీనివాస్ మాట్లాడారు. ఏఎన్సీ ఇన్ఫోటెక్ ఉపాధ్యక్షుడు అరుణ్‌బోడ, ఇతర సంస్థల ప్రతినిధులతో బాటు వైద్యులు పల్మనాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ నళిని నాగళ్ళ, న్యూరో సర్జన్స్ డాక్టర్ అజయ్‌రెడ్డి, డాక్టర్ రణధీర్‌కుమార్,ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- మండల పరిధిలో 25 పరీక్షా కేంద్రాలు.. 5,660 మంది విద్యార్థులు
- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు

శేరిలింగంపల్లి: పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు మార్చి 18వ తేదీన ప్రారంభం అవుతాయి. మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన 5,660 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు.

- శేరిలింగంపల్లి మండలంలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,660 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.పరీక్షా కేంద్రాలను మండల విద్యాధికారి వెంకటయ్య పరిశీలించి ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షించారు.
- ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- విద్యార్థులను 30 నిమిషాల ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.
- ప్రతి క్లాస్‌రూమ్‌లో ఒక ఇన్విజిలేటర్ పర్యవేక్షణలో 20మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు.
- ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు.
- పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ముందు సీల్డ్ కవర్‌లోని పేపర్లు తీసేలా ఏర్పాట్లు
- జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో సీసీ కెమెరాలు లేని చోట వాటిని ఏర్పాటు చేస్తున్నారు

18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాలు ఇవే..

శేరిలింగంపల్లి మండల పరిధిలో 25 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి

- ఎంఎస్ఆర్ హైస్కూల్, నాగార్జున హైస్కూల్, విద్యావాణి హైస్కూల్, న్యూ నేషనల్ స్కూల్ (చందానగర్), అక్షయ ఫౌండేషన్ స్కూల్ (నల్లగండ్ల)
- జిల్లా పరిషత్ హైస్కూల్ శేరిలింగంపల్లి, విద్యానికేతన్ స్కూల్ తారానగర్,
- శారద విద్యానికేతన్, ది ఇండో ఇంగ్లిష్ హైస్కూల్ (మియాపూర్), జిల్లా పరిషత్ హైస్కూల్ (మియాపూర్).
- కేఏఆర్ విద్యాలయ (మదీనాగూడ),
- జిల్లా పరిషత్ హైస్కూల్ (కొత్తగూడ), విద్యా హైస్కూల్ (అంజయ్యనగర్ గచ్చిబౌలి),
- న్యూ బ్లూమ్ హైస్కూల్, శ్రీ గౌతమి గ్రామర్ హైస్కూల్, శారదా హైస్కూల్ (కొత్తగూడ),
- జిల్లా పరిషత్ హైస్కూల్ (కొండాపూర్)జీవీఆర్ హైస్కూల్ (కొండాపూర్)
- జిల్లా పరిషత్ హైస్కూల్ (గచ్చిబౌలి),
- జిల్లా పరిషత్ హైస్కూల్ మాదాపూర్, స్వాతి హైస్కూల్ (మాదాపూర్)
- యునైటెడ్ హైస్కూల్, సెయింట్ ఇసాక్ అడ్వంట్ స్కూల్ (న్యూ హఫీజ్‌పేట్)
- రాయదుర్గంలో జిల్లా పరిషత్ హైస్కూల్, నాగార్జున పాఠశాల (రాయదుర్గం)లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు

శేరిలింగంపల్లి మండల పరిధిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో వసతులు ఉన్న స్కూళ్లలోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. డ్రింకింగ్ వాటర్, ఫ్యాన్స్, లైట్స్ ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ఏర్పాట్లపై స్వయంగా కేంద్రాలను పరిశీలించాము.

– కె.వెంకటయ్య, ఎంఈఓ, శేరిలింగంపల్లి మండలం

నేడు శ్రీవారి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి శనివారం సాయంత్రం 6గంటల నుంచి 8.30గంటల వరకు శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి జీపీకే కృష్ణ తెలిపారు.

నేడు, రేపు పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత జరుగుతుంది. ఈ సంతకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు వచ్చి అమ్మకాలు, కొనుగోలు చేపడతారు.

రాందేవ్‌రావు ఆస్పత్రి సేవలకు గుర్తింపు

హానరింగ్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు

ఆల్విన్‌కాలనీ: సమాజానికి రాందేవ్‌రావు ఆస్పత్రి చేస్తున్న సేవలను గుర్తించి 'మెడ్‌గేట్ టుడే'మాసపత్రిక, ఎంటీ ఇండియా హెల్త్‌కేర్ వారు హానరింగ్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును మెడికల్ డైరెక్టర్ కల్నల్ డా. కె. కమలాకర్‌కు అందజేశారు. మోస్ట్ ప్రామిసింగ్ హెల్త్‌కేర్ లీడర్ ఇన్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్ అవార్డును బొంబాయిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం విక్రమ్‌రామ్ దేవ్ రావు, మీరా రావు, ప్రశాంత్‌రెడ్డి, అపర్ణరావు, సీఈఓ డా. ఎస్. యోబులు మాట్లాడారు. అవార్డును అందుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డా. కె. కమలాకర్‌కు వైద్యులు, నర్సులు, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ అభినందనలు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కూకట్‌పల్లి: మూసాపేట ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కాముని చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన పలు నిర్మాణాలు శుక్రవారం కూల్చివేశారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు బఫర్ జోన్‌లో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



కాముని చెరువు బఫర్ జోన్ ప్రాంతంలో నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

మహిళలను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి

మోతీనగర్: సృష్టికి మూలమైన స్త్రీని గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని బీజేపీ మేడ్చల్ జిల్లా మహిళా కార్యదర్శి పులిగొళ్ల శ్రీలక్ష్మీయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో జరిగిన హెచ్‌ఎస్ స్పోర్ట్స్ అండ్ సిల్వర్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌కు చెందిన పులిగొల్ల శ్రీలక్ష్మీయాదవ్‌ను హెచ్‌ఎస్ స్పోర్ట్స్ అండ్ సిల్వర్ అవార్డుతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డును ఈటల జమున శ్రీలక్ష్మీకి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీయాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో ఎంత అభివృద్ధి చెందుతున్నా కొన్ని ప్రదేశాల్లో మహిళలకు సరైన గుర్తింపు లభించటం లేదన్నారు. హెచ్‌ఎస్ స్పోర్ట్స్ అండ్ సిల్వర్ సంస్థ చేస్తున్న సేవలు ఎంతో అమోఘమని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళల హక్కుల కోసం కృషి చేస్తామని తెలిపారు. తనకు ఈ అవార్డును అందజేసినందుకు జమునకు కృతజ్ఞతలు తెలిపారు.


అవార్డును అందుకుంటున్న పులిగొళ్ల శ్రీలక్ష్మీయాదవ్

మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

అపోలో హెల్త్, లైఫ్ స్టైల్ లిమిటెడ్ సీఈవో శ్రీరామ్ అయ్యర్

లక్డీకాపూల్: మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరని అపోలో హెల్త్, లైఫ్ స్టైల్ లిమిటెడ్ సీఈవో శ్రీరామ్ అయ్యర్ తెలిపారు. కిడ్నీ వైఫల్యం ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సమస్య అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అపోలో హెల్త్, లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్‌ఎల్‌ఎల్) అనుబంధ సంస్థ అపోలో డయాలసిస్ క్లినిక్‌లు కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన మాస్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచితంగా స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో అనేక మంది బ్లడ్ సీరమ్ క్రియేటినిన్ పరీక్షలు చేయించుకున్నారు. నెఫ్రాలజిస్ట్ చర్చలు, వాకథాన్‌లతో సహా అనేక ఇతర కార్యకలాపాలు నిర్వహించారు. ఈ క్యాంపుల్లో రెండు లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో డయాలసిస్ క్లినిక్‌లు సీవోవో సుధాకరరావు, అపోలో డయాలసిస్ క్లినిక్‌లు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 15 మందికి జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నామని వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 15 మందికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించారు.

టీ వర్క్స్‌ను సందర్శించిన ఎఫ్‌టీసీసీఐ, ఐసీటీ, ఐడీసీ ప్రతినిధి బృందం



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలో భారత దేశపు అతిపెద్ద నమూనా కేంద్రంగా గుర్తింపు పొందిన టీవర్క్స్ ప్రాంగణాన్ని శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అందులో కమిటీలైన ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ సెల్(ఐడీసీ) సంయుక్త ప్రతినిధి బృందం సందర్శించింది. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, ఐసీటీ చైర్మన్ మోహన్‌రాయుడు, ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్ గరిమెళ్ళ నాయకత్వాలలో ప్రతినిధుల బృందం సందర్శించింది. టీ వర్క్స్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలాజయదేవ్ మాట్లాడుతూ తెలంగాణలో ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి మా నిబద్ధతత టీ వర్క్స్ సందర్శన ద్వారా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ, ఐసీటీ, ఐడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దూర విద్య కోర్సుల దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) ఆధ్వర్యంలో దూరవిద్యా కోర్సులకు దరఖాస్తు గడువును పెంచారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా బ్లెండెడ్ మోడ్ ద్వారా అందించే ఒక సంవత్సరం డిప్లొమో కోర్సుల కోసం దరఖాస్తులను కోరుతోంది. ఈ కోర్సులు యూజీసీ, ఏఐసీటీఈ, డీఈసీ జాయింట్ కమిటీచే ఆమోదించబడిన కోర్సులు ఉన్నాయి. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ నుంచి ప్రాస్పెక్టస్ డౌన్ లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పీజు రసీదుతోపాటు సెక్షన్ ఆఫీసర్ సెంటర్ ఫర్ డిస్టెన్ అండ్ వర్చువల్ లెర్నింగ్‌కి పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 040-24600264, 040-24600265లో సంప్రదించాలి.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 20, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 50, దొండ 35, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 35, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 300.

ఓటరు అవగాహన ర్యాలీ

పటాన్‌చెరు టౌన్: ఓటు తోనే యువత భవిష్యత్తు ముడిపడి ఉంటుందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా వాలంటీర్ అజయ్ యాదవ్, రుద్రారం ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు షరీఫుద్దీన్ అన్నారు. శుక్రవారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండలం రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలసి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత, భవిష్యత్ తరాలకు ఎలాం ఉపయోగపడుతుందో వివరించారు. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ల ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. టీచర్ శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

పశుసంవర్ధకశాఖ జేడీ డా.వసంతకుమారి

పటాన్‌చెరు టౌన్: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వసంతకుమారి తెలిపారు. శుక్రవారం జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి గోశాలలో ప్రారంభించారు. టీకాల పంపిణీ కార్యక్రమాన్ని వచ్చే నెల 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. 27 మండలాలు 647 గ్రామాల్లో 1,69,455 పశువులు ఉన్నాయన్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 72 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామానికి ఓ బృందం వెళ్లి పశువులకు టీకాలు వేస్తారన్నారు. మూడు నెలలు పైబడిన పశువులన్నింటికీ ఈ టీకాలు వేయించాలన్నారు. ఆమెతో పాటు సహాయ సంచాలకులు డాక్టర్ రాజేశ్వరరావు కిష్టారెడ్డిపేట పశువైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ విశ్వ చైతన్య, సిబ్బంది సుఖేష్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎస్సీ, ఎస్టీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సీతామహాలక్ష్మి సూచించారు. జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలను సీతామహాలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. బోధన గురించి ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం వసతి, తరగతి గదులు, వంటశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాని రోడ్‌షోలో శేరిలింగంపల్లి నేతలు

గచ్చిబౌలి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొన్న విజయ సంకల్ప రోడ్‌షోకు శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. మియాపూర్ న్యూకాలనీ శివాలయం వద్ద జెండా ఊపి రవికుమార్‌యాదవ్ ప్రారంభించారు. చేవెళ్ల పార్లమెంటు సీటు బీజేపీదేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్డారం వేంకటేశ్వర ఆలయ నూతన కమిటీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీని శుక్రవారం నియమించారు.ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, డైరెక్టర్‌గా లక్ష్మారెడ్డి ఎంపికయ్యారు. నూతనంగా ఏర్పాటైన కమిటీకి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులు దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు డాకయ్యసాగర్, రవీందర్ గౌడ్, గంగమ్మ,ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మల్లారెడ్డి, శివానందం, ప్రభు, రామచంద్రారెడ్డి, అశోక్, ముత్యాల రవీందర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, నర్సింహగౌడ్, మల్లేశం గౌడ్, రఘుపతిరెడ్డి, స్థానిక నాయకులు, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి

హఫీజ్‌పేట్: యాచకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఓల్డ్ ఎంఐజీ నల్లగండ్ల అండర్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి (50) శుక్రవారం ఉదయం పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం అతడిని గమనించి వెళ్ళి పరిశీలించగా మృతి చెందాడని గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై నల్ల బనియన్, ప్యాంటు ఉన్నాయని, త్రిశూలం, ఓం టాటూ ఉన్నాయన్నారు. అతడి వివరాలు తెలిస్తే చందానగర్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కళ్యాణికి డాక్టరేట్ ఆఫ్ ఫెలోషిప్ అవార్డు



కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్ పీహెచ్‌డీ ఫెలోషిప్ విద్యార్థిని జి. కళ్యాణికి అరుదైన గౌరవం దక్కింది. పీహెచ్‌డీ డిగ్రీ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ''రిమూవల్ ఆఫ్ అమోనియా బై యాక్టివేటెడ్ స్లడ్జ్ ప్రాసెస్, జియోలైట్స్ అండ్ అడ్వాన్స్‌డ్ ఆక్సిడేషన్ ప్రాసెస్ ఫ్రమ్ సింథటిక్ అండ్ ఇండస్ట్రియల్ వేస్ట్ వాటర్''పై పరిశోధన పత్రాన్ని పూర్తి చేసినందుకు ఆమెకు డాక్టరేట్ ఆఫ్ ఫెలోషిప్ అవార్డును ప్రకటించారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్‌ను శుక్రవారం జేఎన్‌టీయూ విడుదల చేసింది.